క్లుప్తంగా

నేడు గంగాలమ్మ తల్లి పండగ



గంగాలమ్మ తల్లి

మునగపాక: మూలపేటలో గురువారం గంగాలమ్మ తల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏటా సెప్టెంబర్ నెలలో అమ్మవారి పండగను నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. రాత్రి గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



తిమ్మరాజుపేటలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అరుణ

మునగపాక: తిమ్మరాజుపేటలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక సత్యసాయి బాబా ఆలయం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖకు చెందిన శ్రీ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరానికి డాక్టర్ అరుణ వైద్య సేవలందించారు. ఈ శిబిరానికి 86 మంది రోగులు హాజరు కాగా వారిలో 26 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్, నర్సింగ్ స్టాఫ్ తేజస్విని, భజన మండలి సభ్యులు సరిసా శివ, మళ్ల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు



గ్రావెల్ తవ్వకాలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వెంకట సోమునాయుడు

అచ్యుతాపురం రూరల్ : ఎం.జగన్నాథపురం గ్రామంలో జరుగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలపై తహసీల్దార్ సత్యనారాయణకు బీజేపీ మండల వైస్ ప్రెసిడెంట్ కర్రి వెంకట సోమునాయుడు బుధవారం ఫిర్యాదు చేశారు. జనసేన, టీడీపీ నాయకులు అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్నారని ఆయన ఆరోపించారు. కొండపై ఉన్న విలువైన చెట్లను పొక్లెయిన్‌తో తొలగించి ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తవ్వి తరలించుకుపోతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. కొండపై రహదారి నిర్మాణం పేరుతో గ్రావెల్‌ను తవ్వి పరిశ్రమలకు, ప్రైవేట్ లేఅవుట్లకు, ఇంటి నిర్మాణాలకు తరలిస్తూ అక్రమ ధనార్జన చేస్తున్నారన్నారు. తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

డెర్మటాలజిస్ట్ సాయితేజకు మెడల్ అందజేత



వీసీ చేతుల మీదుగా మెడల్ తీసుకుంటున్న డెర్మటాలజిస్ట్ సాయితేజ

పాయకరావుపేట: పట్టణానికి చెందిన డెర్మటాలజిస్ట్ గుడివాడ సాయితేజ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ చేతుల మీదుగా మెడల్ అందుకున్నారు. ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పరిధిలో పోస్టు గ్రాడ్యుయేట్ డెర్మటాలజీ విభాగంలో 2022లో ఆయన రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొందారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో జరిగిన 28వ స్నాతకోత్సవ సభలో మెడల్‌ను ప్రదానం చేశారు. సాయితేజ తండ్రి జి.వి.వి.సత్యనారాయణ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

రహదారులు దారుణం..
అవస్థల ప్రయాణం



బురదమయంగా ఉన్న అన్నవరం రహదారి



రామచంద్రపురం జంక్షన్‌లో డైవర్షన్ రోడ్డు

- అన్నవరం రోడ్డులో లోతట్టులో అక్విడెక్టు
- నిలిచిపోతున్న వర్షపు నీటితో పాట్లు
- ఏడాది క్రితం కుంగిన రామచంద్రపురం వంతెన
- పక్కనే డైవర్షన్ రోడ్డులోనే రాకపోకలు

కోటవురట్ల: ఆ రహదారుల్లో ప్రయాణించాలంటే ఇక్కట్లు తప్పవు మరి. ఆది నుంచి అవస్థల ప్రయాణమే మొదలెట్టాలి. ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి తిరిగి చేరేంత వరకు నానా పాట్లు పడాల్సిందే. ప్రతి రోజు, విద్యార్థులు, వ్యాపారులకు అవస్థల ప్రయాణం తప్పడం లేదు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు నానా యాతన పడుతున్నారు.

అన్నవరం రహదారిలో..

యండపల్లిలో అన్నవరం జంక్షన్ నుంచి ఆ గ్రామానికి వెళ్లాలంటే వాహనదారులకు అగ్నిపరీక్షే. అన్నవరం జంక్షన్ నుంచి గ్రామానికి వెళ్లాలంటే ఇక్కడ ఉన్న ఏలేరు కాలువపై ఉన్న అక్విడెక్టును దాటాల్సి ఉంటుంది. దీనిని సుమారు 30 ఏళ్ల క్రితం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా పల్లంగా నిర్మించారు. రానురాను రాకపోకలు పెరగడంతో అక్విడెక్టుపై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. వర్షాకాలంలో మరింత ఇబ్బందులు పడాల్సివస్తోంది. చిన్నపాటి వర్షానికే అక్విడెక్టు మరో కాలువలా మారిపోతోంది. భారీగా వర్షం నీరు నిలిచిపోతే చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తోంది. ఈ గ్రామానికి వెళ్లేందుకు ఎక్కువ శాతం మహిళలు కాలినడకనే వెళుతుంటారు. అక్విడెక్టుపై దగ్గరి దారి కావడంతో చాలా వరకు దీనిపైనే రాకపోకలు సాగిస్తారు. విద్యార్థులు కూడా అక్విడెక్టు మీదుగా ప్రతి రోజు నర్సీపట్నం వెళ్తుంటారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ అక్విడెక్టు బాగా పల్లంగా ఉండడంతోనే అసలు సమస్య వస్తోంది. ఎన్నో ఏళ్లుగా వర్షం నీరు నిలిచిపోవడం, నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటోంది. ఇది కూలితే పెను ప్రమాదం తప్పదు. అక్విడెక్టు పూర్తిగా శిథిలమై కూలిపోకముందే ఏలేరు కాలువపై మినీ వంతెన నిర్మించాలని ఆ గ్రామస్తులు వేడుకుంటున్నారు.

రామచంద్రపురం జంక్షన్‌లో..

నర్సీపట్నం–రేవుపోలవరం రహదారిలోని రామచంద్రపురం జంక్షన్‌లో మినీ వంతెన నిర్మించకపోవడంతో మూడు మండలాల ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ రహదారిలో ప్రతి రోజు వేలాది మంది రాకపోకలు సాగిస్తారు. వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతాయి. ఏడాది కిందట ఇక్కడ ఉన్న మినీ వంతెన కుంగిపోవడంతో పక్కనే మట్టితో డైవర్షన్ రోడ్డు వేశారు. అప్పటి నుంచి ఆ డైవర్షన్ రోడ్డే నేటికీ దిక్కయింది. ఏడాది కావస్తున్నా కొత్త వంతెన ప్రతిపాదన లేకపోవడంతో వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. భారీ వర్షం కురిస్తే ఈ డైవర్షన్ రోడ్డు కూడా కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. నర్సీపట్నం నుంచి అడ్డురోడ్డుకు వెళ్లేందుకు ఈ జంక్షన్‌లో డైవర్షన్ రోడ్డును దాటాల్సిందే. ఇటీవల భారీ వాహనాల రాకపోకలు పెరగడంతో ఇక్కడ దూళి రేగి ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించకపోతే ముందు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ మినీ వంతెన నిర్మించాలని మూడు మండలాల ప్రజలు కోరుతున్నారు.



అన్నవరం వెళ్లే రహదారిలో బాగా దిగువకు ఉన్న అక్విడెక్టు

మినీ వంతెన నిర్మించాలి..



అన్నవరం జంక్షన్‌లో ఏలేరు కాలువపై మినీ వంతెన నిర్మించాలి. ఇక్కడ పల్లంగా ఉండడంతో వర్షాకాలంలో వాహనదారులకు ఇబ్బంది కలుగుతోంది. అక్విడెక్టు కూడా శిథిలావస్థకు చేరింది. ముందుగా అధికారులు స్పందించి రాకపోకలకు వీలుగా మినీ వంతెన నిర్మించాలి.

– అయ్యపురెడ్డి బాబ్జీ, అన్నవరం

నిత్యం నరకయాతన



రామచంద్రపురం జంక్షన్‌లో మినీ వంతెన కుంగిపోయి ఏడాదవుతోంది. కూటమి ప్రభుత్వం పక్కనే మట్టితో గ్రావెల్ రోడ్డు వేయించి చేతులు దులిపేసుకుంది. నర్సీపట్నం, కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. మినీ వంతెన నిర్మించకపోతే వాహనదారులకు అవస్థలు తప్పవు.

– ఆర్ఎస్ సత్యనారాయణరాజు, మాజీ వైస్ ఎంపీపీ, తంగేడు

ఉపమాక గ్రంథాలయంలో తనిఖీ



గ్రంథాలయంలో తనిఖీ చేస్తున్న కార్యదర్శి కుమార్‌రాజు

నక్కపల్లి: ఉపమాక గ్రామీణ గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్ర కుమార్‌రాజు బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పాఠకులకు అందుబాటులో ఉంచిన పుస్తకాల గురించి ఆరా తీశారు. గ్రంథాలయానికి వచ్చిన పాఠకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. దాతల సహకారంతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. సచివాలయాల నుంచి రావాల్సిన గ్రంథాలయ సెస్సును వెంటనే జమ చేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

టి.సిరసపల్లి ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌గా యమున



బొడ్డేడ యమున

మునగపాక: టి.సిరసపల్లి ప్రాథమిక పాఠశాల చైర్‌పర్సన్‌గా బొడ్డేడ యమున ఎన్నికయ్యారు. ఇంతవరకు ఎస్ఎంసీ చైర్మన్‌గా పనిచేసిన ఆనంద్ పిల్లలు వేరే పాఠశాలలో చేరిన నేపథ్యంలో తల్లితండ్రుల సమక్షంలో మంగళవారం ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో బొడ్డేడ యమునను ఇతర తల్లితండ్రులు చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యమున మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎస్ఎంసీ చైర్మన్, హెచ్ఎం పేరుతో బ్యాంక్ అకౌంట్ తెరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు.

రోడ్డెక్కిన సచివాలయ ఉద్యోగులు



ఎంపీడీవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

కోటవురట్ల: ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి తమకు విముక్తి కలిగించాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సచివాలయ ఉద్యోగులు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో చంద్రశేఖర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1.25 లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని, కూటమి ప్రభుత్వం వచ్చాక తమపై ఒత్తిడి పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను తమ సొంత శాఖల్లో కాకుండా ఇంటింటికి తిరిగే పనులు అప్పగించడం వల్ల అనేక అవమానాలకు గురవుతున్నామని వాపోయారు. ఎప్పటిలానే మాతృశాఖలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, సమయపాలన లేని పనుల నుంచి విముక్తి కలిగించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాల వారీగా సీనియారిటీ జాబితా ప్రకటించి పదోన్నతి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన తమ డిమాండ్లను 15 రోజుల్లో పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన బొడ్డేడ



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు.

–మునగపాక

పెండింగ్ వేతనాల కోసం ఉపాధి కూలీల ఆందోళన



పంచాయతీ కార్యదర్శి బాలుకు వినతి అందజేస్తున్న ఉపాధి కూలీలు

మునగపాక: ఉపాధి హామీ పథకం లబ్ధిదారులకు పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. 12 వారాలకు పైగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం తక్షణమే వేతనాలు అందించాలని కోరుతూ బుధవారం మండలంలోని వెంకటాపురం సచివాలయం వద్ద కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు సకాలంలో అందించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పని ప్రదేశంలో సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుతంత్రాలు చేస్తుందన్నారు. కొలతలతో సంబంధం లేకుండా కార్మికులకు రూ.309 చెల్లించాలన్నారు. సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి బాలుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చిన్ని వెంకటలక్ష్మి, అప్పారావు, రామారావు, బలిరెడ్డి శ్రీనివాసరావు, అమ్మాజీ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం, సంకీర్తనలు



సంతబయిల వినాయక ఆలయ ప్రాంగణంలో సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు



కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు

మునగపాక: మునగపాకలోని సంతబయిలలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన కోలాటం, సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. సంతబయిల ప్రధాన వినాయకుని ఆలయ ప్రాంగణంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మునగపాక అన్నమయ్య స్వర తరంగిణి కళాకారులు ప్రదర్శించిన సంకీర్తనలు, కోలాటం ఆహూతులను అలరించాయి. గణనాథుడి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ మండపాటి రాము, ఇతర సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సత్తెమ్మతల్లి ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న రామారావు, లక్ష్మి దంపతులు

మునగపాక: మునగపాకలో చెరువు కాలువ సంఘ పరిధిలో తలపెట్టిన సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. బుధవారం మునగపాకకు చెందిన బొడ్డేడ రామారావు, లక్ష్మి దంపతులు రూ.50వేల నగదును విరాళంగా అందజేశారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దాడి చంద్రరావు, వెలగా అప్పలనాయుడు, కమిటీ సభ్యులు వెలగా వెంకటప్పారావు, వెలగా ధర్మసూరి, వెలగా శ్రీనివాసరావు, దాడి సూరప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



పట్టణంలో భారీ వర్షానికి చెరువులా మారిన రాజీవ్ క్రీడామైదానం



పాత ప్రభుత్వాస్పత్రి ప్రధాన ద్వారం వద్ద నిలిచిన వర్షపునీరు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పట్టణంలో 6.7 సెంటీమీటర్ల వర్షం

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణంలో బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 6.7 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడి ప్రతాపంతో అల్లాడిన ప్రజానీకం భారీ వర్షంతో ఉపశమనం పొందారు. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారి సహా పలు అంతర్గత రోడ్లలో వర్షపు నీరు నిలిచిపోయింది. కాలువల్లో నీరు రోడ్లపైకి పొంగి ప్రవహించింది. రాజీవ్ క్రీడా మైదానం చెరువులా మారింది. ఎంపీడీవో కార్యాలయం, పాత ప్రభుత్వాస్పత్రి సహా కొన్ని కార్యాలయాల ప్రాంగణాలు మోకాలిలోతు నీటితో కనిపించాయి. దీంతో వర్షం తగ్గిన తర్వాత కూడా ఆయా కార్యాలయాలకు రాకపోకలు సాగించడానికి ఉద్యోగులు, ఇతరులు ఇబ్బందులు పడ్డారు. పట్టణానికి సమీపంలో గెడ్డలు, వాగులు, చెరువుల్లో నీరు చేరింది. ఖరీఫ్ సాగు పనులకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మెరక ప్రాంతాల్లో కూడా వరి నాట్లు వేసుకోవడానికి కావాల్సినంత నీరు మడుల్లో చేరింది. భారీ వర్షం కారణంగా 2 గంటల సేపు జనజీవనం స్తంభించిపోయింది. రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు వర్షంలో తడిచి ముద్దయ్యారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పాల్తేరు గ్రామంలో రైతులకు వరి పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఏవో పి.ఆదినారాయణ, ఏఈవో నాగమణి, వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఆర్‌వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు.!



పాయకరావుపేటలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు



కుమారపురంలో దూడ తోకను కొరికి వేసిన కుక్కలు

పాయకరావుపేట: మండలంలో వీధి కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. గ్రామాల్లో విచ్చలవిడిగా గుంపులుగా సంచరిస్తూ దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో ప్రజలు వీధుల్లో తిరగాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఉదయం విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు హడలిపోతున్నారు. బజారు నుంచి చేతిలో సరకుల సంచి పట్టుకుని వస్తుంటే వాటిని లాక్కుంటున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వీధిలోను, ఇంటి బయట, రోడ్ల పైన కుక్కలు తిష్టవేయడంతో మహిళలు, పిల్లలు ఒంటరిగా వెళ్లడానికి భయపడుతున్నారు.

పలు గ్రామాల్లో పంట పొలాల్లో ఉన్న పశువులు, దూడలపై దాడి చేసిన ఘటనలు ఇటీవల చోటుచేసుకున్నాయి. దూడల తోకలు, చెవులను కొరుకేశాయి. సంబంధిత అధికారులు స్పందించి మండలంలోని ఆయా గ్రామాల్లో యథేచ్ఛగా తిరుగుతున్న కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. కుక్కలను పట్టుకుని అటవీ ప్రాంతాలకు తీసుకెళ్లి విడిచి పెడితే సమస్య పరిష్కారం అవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నేడు మెగా జాబ్ మేళా

అనకాపల్లి టౌన్: పట్టణంలోని రాజా థియేటర్ ఎదురుగా ఉన్న గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ ఎన్.గోవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో సుమారు 20 కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ మేళా లో 10వ తరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ చదివిన 18 నుంచి 35 సంవత్సరాల యువతీయువకులు పాల్గోవచ్చని ఆయన తెలిపారు.


సామాజిక కార్యకర్త నూకరాజుకు ఘన సన్మానం



నూకరాజుశర్మను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

నక్కపల్లి: ఆరు దశాబ్దాలుగా నక్కపల్లి, పరిసర గ్రామాల పరిధిలో సేవలందిస్తున్న సామాజిక కార్యకర్త నవర నూకరాజుశర్మను బుధవారం స్థానిక కృష్ణా క్లబ్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. వినాయక చవితి ముగింపు సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపమాక వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు, ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి నవరాత్రులతో పాటు, చుట్టు పక్కల గ్రామాల్లో జరిగే పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఈయన వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుంటారు. టైపు మాస్టారుగా మండల ప్రజలకు సుపరిచితుడు. కొత్తపేటలోని కృష్ణా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రులను ఘనంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన నూకరాజు శర్మను నిర్వాహకులు సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.


బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న రమేష్

కశింకోట: బాల్య వివాహలకు దూరంగా ఉండాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్ తెలిపారు. బాల్య వివాహల వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని తేగాడ వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల నిండకుండా బాలికలకు వివాహం చేయరాదన్నారు. బాలికలు, మహిళల రక్షణకు పలు చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సుడిదోమ నివారణకు చర్యలు చేపట్టాలి



పొలాల్లో పసుపు పల్లెలు, పక్షి స్థావరాలు ఏర్పాటు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

తుమ్మపాల: వరిపైరులో సుడిదోమ నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పసుపు పల్లెలు, పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలని మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ సిరసపల్లి అప్పలరాజు అన్నారు. తుమ్మపాలలో వరిపొలాలను బుధవారం ఆయన పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే చీడపీడల నుంచి వరి పంటను కాపాడుకోవచ్చన్నారు. పొలాల్లో ఏర్పాటు చేసే పక్షి స్థావరాలపై పక్షులు నిలబడి పంటకు హాని చేసే పురుగులను ఏరుకుని తినే వీలుంటుందని, తద్వారా రైతు అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. వరి పంట వేసేందుకు 45 రోజుల ముందు నవధాన్యాలు జల్లుకోవడం వల్ల పంటలో కలుపు లేకుండా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో, ప్రతి గురువారం పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రత్యేక స్టాల్ ద్వారా మార్కెటింగ్ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు, అప్పారావు, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.